క్లుప్తంగా...

15 రోజులుగా తాగునీటికి ఇబ్బందులు

బోడుప్పల్: 20వ డివిజన్‌లో సత్తిరెడ్డి కాలనీ, సాయిరాంనగర్ కాలనీల్లో 15 రోజులుగా తాగునీరు సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సాయిరాంనగర్ కాలనీ అధ్యక్షుడు తోటకూర శ్రీశైలం యాదవ్ అన్నారు. బోడుప్పల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి పైపులైన్ పగిలిపోయి 15 రోజులుగా నీరు రాక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. పైపులైన్ పగిలిన విషయం గురించి జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. లేని పక్షంలో కాలనీ ప్రజలతో కలిసి ధర్నా నిర్వహిస్తామన్నారు.

పీర్జాదిగూడ కమిషనర్‌గా నమ్యానాయక్



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా నమ్యానాయక్ నియమితులయ్యారు. పీర్జాదిగూడ నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమిషన్ చాంబర్‌లో సోమవారం నమ్యానాయక్ కమిషనర్‌గా ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇంతకు ముందు సచివాలయంలో ఏఎస్ఏ, ఇండస్ట్రీస్, కామర్స్ విభాగంలో సెక్షన్ అధికారిగా విధులు నిర్వర్తించారు. పదోన్నతిలో భాగంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నమ్యానాయక్‌కు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కార్పొరేషన్ పాలకసభ్యులు, పార్టీల నాయకులు, ఉద్యోగులు ఆయనకు స్వాగతం పలికారు.

సీఎం రిలీఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌యాదవ్

బోడుప్పల్: 15వ డివిజన్‌లోని నర్సింహారెడ్డి కుమారుడు సాయికుమార్‌రెడ్డి అనారోగ్యానికి గురి కావడంతో ఆయనకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును సోమవారం 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పడతం లోకేష్, కాలనీవాసులు బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాములు, దామోదర్ పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



బోడుప్పల్: వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్‌లో సోమవారం వీధి కుక్కలను బర్త్ కంట్రోల్ కార్యక్రమంలో భాగంగా బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ సంస్థ వారు పట్టుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కలకు వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్, వాటిని తిరిగి యధా స్థానంలో వదిలేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రముఖ జంతు సంక్షేమ సంస్థ బ్లూ క్రాస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఈ ఒప్పందంలో భాగంగా సోమవారం వీరారెడ్డినగర్ చౌరస్తాలో 7 వీధి కుక్కలను బ్లూ క్రాస్‌కు తరలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జాన్‌పాల్‌రెడ్డి, బ్లూ క్రాస్ ప్రతినిధి కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



ఉప్పల్: గంజాయి విక్రయిస్తూ ఓ యువకుడు పోలీసులకు దొరికిపోయిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ నెహ్రూ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా ఘనాపూర్ ప్రాంతానికి చెందిన వడ్ల కార్తీక్(23) ఇంటర్ పూర్తిచేసి పెస్ట్ కంట్రోల్‌గా పనిచేస్తూ రామంతాపూర్ రాంశంకర్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొంతకాలంగా గంజాయికి అలవాటుపడి అదే గంజాయితో వ్యాపారం చేస్తున్నాడు. అరకు వెళ్లి రూ.40 వేలతో ఐదు కిలోల గంజాయి తీసుకువచ్చాడు. సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని 5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కొనలేం.. తినలేం..



ఆకాశాన్నంటుతున్న కూరగాయల ధరలు

- రూ.200లకు చేరిన టమాట
- అదేస్థాయిలో పెరుగుతున్న పచ్చిమిర్చి
- భారీ వర్షాల కారణంగా ధరలు పైపైకి..
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

కాప్రా: వారం రోజులుగా రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వాణిజ్య, తృణధాన్యాలతో పాటు కూరగాయల సాగు రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతో పంట దిగుబడులు తగ్గి కూరగాయల ధరలు పెరిగిపోయాయి. ఇప్పటికే టమాటా, పచ్చిమిర్చి కొనలేని పరిస్థితి ఉంటే ఇప్పుడు వాటి ధర మరింత కొండెక్కింది. అమాంతం పెరిగిన ధరలతో సామాన్యులు, మధ్యతరగతి జీవులు కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. మార్కెట్‌కు వెళ్లి ఏ కూరగాయల ధర అడిగినా రేటు విని అమ్మో.. అనే పరిస్థితి.

వర్షాలతో.. మరింత పెరిగిన ధర

టమాట ధర ఎప్పుడు ఏ విధంగా ఉంటుందో ఎవరికీ అర్థం కాని పరిస్థితి. ఒక్కోసారి కిలో టమాట రూ.2 ఉన్నా కొనేవాళ్లు దిక్కులేక రైతులు రోడ్లపై పారబోయాల్సిన పరిస్థితి ఉంటుంది. కొన్నిమార్లు దిగుబడి లేక ఒక్కసారిగా అమాంతం ధరకు పెరిగిపోతుంది. ఇప్పటికే వినియోగానికి తగ్గ దిగుబడి లేకపోవడంతో ధరలు పెరిగాయి. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంటలకు కూడా నష్టం వాటిల్లి మరింత రేటు పెరిగింది. ప్రస్తుతం కిలో టమాట ధర రూ.170కిపైగా పలుకుతోంది.

దళారులు రెచ్చిపోయి..

కూరగాయల ధరలు విని సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. నెలవారి బడ్జెట్ ఒక్కసారిగా పెరగడంతో ఇతర ఖర్చులు తగ్గించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంకొందరైతే కూరగాయలు కొనుగోలు చేసే స్థోమత లేక కారం మెతుకులు తిని రోజు గడపాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. దళారులు రెచ్చిపోయి కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలు పెంచుతున్నారు.

అన్ని కూరగాయలది.. అదే పరిస్థితి..

ఒక్క టమాట ధరే కాదు అటు పచ్చిమిర్చితో పాటు ఇతర కూరగాయల ధరలు కూడా మండిపోతున్నాయి. పచ్చిమిర్చి ధర కూడా అదే స్థాయిలో సెంచరీ దాటింది. ప్రస్తుతం కిలో పచ్చిమిర్చి ధర రూ.120. ఇదిలా ఉంటే మరికొన్ని కూరగాయల ధరలు మాత్రం మార్కెట్ యార్డుల్లో దళారులు సిండికేట్ అయ్యి కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచి సామాన్య ప్రజల బేబును కొల్లగొడుతూ చిరు వ్యాపారుల పొట్టకొడుతున్నారు.

మార్కెట్‌లో కూరగాయల ధరలు

టమాట	170
పచ్చిమిర్చి	120
బీరకాయ	100
బెండకాయ	80
వంకాయ	60
దొండకాయ	80
కాకరకాయ	80
ఆలుగడ్డ	30
క్యాప్సికం	80
క్యారెట్	80
బీట్‌రూట్	50
గోకరకాయ	60
బీన్స్	160
చిక్కుడుకాయ	100
చామగడ్డ	50
దోసకాయ	40
సొరకాయ 30 (ఒకటి సైజును బట్టి)	
క్యాబేజీ 30 (ఒకటి సైజును బట్టి)	
క్యాలీఫ్లవర్ 40 (ఒకటి సైజును బట్టి)	

వ్యాపారం పూర్తిగా తగ్గిపోయింది



ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు కొనుగోలు తగ్గించడంతో వ్యాపారం కూడా పూర్తిగా దెబ్బతింది. మార్కెట్‌లో కొనుగోలు చేసి రోజుకో చోట వారాంతపు సంతలో విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాం. ఈ ధరల పెరుగుదలతో వ్యాపారం లేక మార్కెట్‌కు వెళ్లి వచ్చినా రవాణా ఖర్చులకు కూడా రావడంలేదు. ఇదిలానే కొనసాగితే కూరగాయల విక్రయాలపై ఆధారపడిన చిరు వ్యాపారులకు ఇబ్బంది తప్పదు. - నాగరాజు, చిరువ్యాపారి

కెప్టెన్ వీర రాజారెడ్డి సేవలు మరువలేనివి



హబ్సిగూడలో కెప్టెన్ వీర రాజారెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: కెప్టెన్ రాపోలు వీర రాజిరెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం హబ్సిగూడలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి కెప్టెన్ వీర రాజారెడ్డి చేసిన సేవలు మరువలేనివన్నారు. బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గద్దం రవికుమార్, గరిక సుధాకర్, కంచర్ల సోమిరెడ్డి, నాగేష్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. కెప్టెన్ రాపోలు వీర రాజారెడ్డి వర్ధంతికి కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ హాజరై నివాళులర్పించారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు పెంపు

అల్వాల్: మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ రంగ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు చేరేందుకు అడ్మిషన్ల గడువు ఈనెల 5వ తేదీ వరకు పెంచినట్లు జిల్లా విద్యాధికారి ఎం.కిషన్ తెలిపారు. రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులు మొదటి సంవత్సరం అడ్మిషన్ కోసం జూలై 31 వరకు మాత్రమే గడువు ఉండగా.. భారీ వర్షాల కారణంగా ఈనెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. రెగ్యులర్ ఇంటర్ అడ్మిషన్లకు టీసీ తప్పనిసరి అని స్పష్టం చేశారు. 6వ తేదీ నుంచి 16వ తేదీ వరకు రూ.500 లేట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

త్వరలోనే సమస్యలకు పరిష్కారం

కాప్రా: నమస్తే ఉప్పల్ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర 20వ రోజు మీర్‌పేట్‌-హెచ్‌బీకాలనీ డివిజన్‌లో కొనసాగింది. సోమవారం డైమండ్ హిల్స్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర హెచ్‌బీకాలనీ ఫేజ్‌-2, లక్ష్మీనగర్, చైతన్యనగర్, ఇంద్రానగర్, మంగాపురం, భక్షిగూడ, కైలాసగిరి, రాజీవ్‌నగర్ మీదుగా నవోదయ కాలనీ వరకు కొనసాగింది. కాలనీల్లో స్థానికులను పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ సమస్యలతో పాటు ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డు సమస్యలు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని ఎస్ఎల్ఎన్ఎస్ ఫంక్షన్ హాల్ నుంచి ఎన్ఎఫ్‌సీ కాలనీ వరకు రూ.13 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును సోమవారం స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షురాలు చేవూరి అరుణ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎస్. స్వామి తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఎలివేటెడ్ కారిడార్ పనుల జాప్యంపై బీజేపీ నిరసన ర్యాలీ




ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనుల జాప్యంపై బీజేపీ నిరసన ర్యాలీ

ఉప్పల్ మాజీ శాసన సభ్యుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

ఉప్పల్: ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో జాప్యాన్ని నిరసిస్తూ ఉప్పల్ మాజీ శాసన సభ్యుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారిపై సోమవారం బీజేపీ నాయకులు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ టు నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి, రోడ్డు మరమ్మతులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినా పనులు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులున్నా ఎందుకు పనులు చేపట్టడం లేదని ప్రశ్నించారు. వరంగల్ జాతీయ రహదారిపై నిత్యం వాహనదారులు రోడ్డుపై అవస్థలు పడుతుంటే బీఆర్ఎస్ నాయకులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉప్పల్ ప్రజలపై తీవ్ర వివక్ష చూపిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని మొండి వైఖరిని వీడాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కక్కిరేని చేతన, బండారి శ్రీవాణి, మహంకాళి లక్ష్మణ్, ఏచూరి యాదగిరి, గౌరిగే కృష్ణ, దేవేందర్‌రెడ్డి, రేవల్లి రాజు, ఎల్లగోని ప్రకాశ్, తెలంగాణ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ జలమండలి ఎండీ దానకిషోర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ బలరాంనగర్, ఓల్డ్ నేరేడ్‌మెట్, కృపానంద్ అపార్ట్‌మెంట్స్, ఓల్డ్ మల్కాజిగిరి ప్రాంతాల్లో యూజీడీ పైపులైన్లు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో నెల్సన్, అద్వైత్‌కుమార్, యాదవ్, రవి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీకి మరమ్మతులు

కాప్రా: ఏఎస్‌రావునగర్ డివిజన్ మాపిల్ హోమ్స్ వద్ద డ్రైనేజీ మరమ్మతులు చేపట్టారు. మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానిక కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డికి కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. తక్షణమే అక్కడి చేరుకున్న ఆమె డ్రైనేజీ మరమ్మతులను ప్రారంభించి దగ్గరుండి పర్యవేక్షించారు. కార్పొరేటర్‌తో పాటు వెళ్లిన ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ బీబ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి డ్రైనేజీ మరమ్మతు పనుల్లో పనిచేశారు. సమస్య ఉందంటే పరుగున వచ్చే సోమశేఖర్‌రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలిస్తున్నాడని స్థానికులు కొనియాడారు.



పారిశుద్ధ్య కార్మికులకు పీఆర్‌సీ ఇప్పించాలి



మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కుర్మన్న

మల్లాపూర్: జీహెచ్ఎంసీలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు 30 శాతం పీఆర్‌సీ ఇప్పించాలని కోరుతూ సోమవారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డికి బీఆర్ఎస్‌టీయూ కాప్రా సర్కిల్ అధ్యక్షుడు జి.కుర్మన్న వినతి పత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు, జీహెచ్ఎంసీలో పనిచేసే ప్రతి కార్మికుడికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, కార్మికుల దినోత్సవం రోజు సెలవు ఇప్పించాలని కోరారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి తమ డిమాండ్లను అమలు చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో బీఆర్ఎస్‌టీయూ కార్మికులు తదితరులు ఉన్నారు.

కల్వర్టు నిర్మాణ పనుల పరిశీలన



కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: దాబాగార్డెన్ సమీపంలో కొనసాగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి పరిశీలించారు. స్లాబ్ పనులు పూర్తయ్యాయి. అప్రోచ్ రోడ్డు, సైడ్‌వాల్స్ పనులు కొనసాగుతున్నాయి. కల్వర్టు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కల్వర్టు సమీపంలోనే ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈ అభిషేక్, బీఆర్ఎస్ నాయకులు భైరి భాస్కర్‌గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో కుంటుపడిన అభివృద్ధి



మల్కాజిగిరి: పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగే విద్యార్థి సభను జయప్రదం చేయాలని మల్కాజిగిరి ఏబీవీపీ కన్వీనర్ అఖిల్‌సింగ్ పిలుపునిచ్చారు. సోమవారం ఈస్ట్‌ఆనంద్‌బాగ్‌లో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యారంగంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేకపోయిందని, ఉపకార వేతనాలు చెల్లించేందుకు జాప్యం జరుగుతుండటంతో విద్యార్థులు నష్టపోయారన్నారు. కార్యక్రమంలో నాయకులు విజయ్, అవినాష్, విపుల్, అఖిల్, రాజేష్, సుషాంక్, భాను తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ విభాగం నూతన కమిటీ ఎన్నిక



నియామక పత్రాలు అందజేస్తున్న డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. సోమవారం అల్వాల్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెంకటాపురం డివిజన్ మైనార్టీ విభాగం నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఖజామోనోద్దీన్, మైనార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా సమీనబేగం, ప్రధాన కార్యదర్శిగా మసుదాబేగం, సుల్తానా బేగం, షమీమ్, రుక్షనాబేగం, శిరినాబేగం, షకీలా నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులకు నందికంటి శ్రీధర్ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వెంకటాపురం డివిజన్ మహిళా అధ్యక్షురాలు పద్మ తదితరులు ఉన్నారు.

యువ చైతన్య ఫ్రెండ్స్ నూతన కమిటీ ఎన్నిక



మేయర్‌తో యువ చైతన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన కమిటీ

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధి కమలానగర్ మొదటి డివిజన్‌లో యువ చైతన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. యువ చైతన్య ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్యామల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేతవత్ రామ్‌నాయక్, ఉపాధ్యక్షుడు సుంకు నితిన్, కేతావత్ శ్రీనునాయక్, పబ్బతి వెంకటేష్, కోశాధికారిగా కౌట్టి కిషోర్, ఆర్గనైజింగ్ సెక్రెటరిగా ధరావత్ వెంకటేశ్, కేతావత్ వినోద్‌ను ఎన్నుకున్నారు. వారు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మేయర్ నూతన కమిటీని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో శ్యామల, సాయిలు, శ్యామల నర్సిహ, శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగు మనోరంజన్‌రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, యువ నాయకులు ప్రభు, పాన్నాభాయ్, ప్రశాంత్, ఆంజనేయులు, మాజీ అధ్యక్షుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతి



సీఎస్ శాంతికుమారికి వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు

ఉప్పల్: వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలుపుతూ సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి, సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారిని కలిసి సమస్యలతో కూడిన వినతి ప్రతాన్ని అందజేశారు. ఇటీవల నగరంలో కురిసిన భారీ వర్షాలకు వరదతో పాటు రోడ్లు, ఇళ్లలో బురద పేరుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్తీలు, లోతట్టు ప్రాంతాలే కాకుండా కాలనీలు సైతం నీటి మునిగి అనేక ఇబ్బందులు పడ్డారని, జాతీయ రహదారులపై సైతం గుంతలు పడటంతో రవాణా అస్తవ్యస్తంగా మారిందని వారు వినతి ప్రతంలో పేర్కొన్నారు. వెంటనే సమస్యల పరిష్కారానికి ప్రత్యేక నిధులను కేటాయించాలని కోరారు. సీఎస్ శాంతకుమారి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

ప్రత్యేక నిధులివ్వండి

కాప్రా: వరద సమస్యలను పరిష్కరించాలని ఏఎస్ రావునగర్ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషరెడ్డి కోరారు. ఇదే విషయంపై సోమవారం సీఎస్ శాంతి కుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలతో లోతట్టు ప్రాంత కాలనీలవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారానికి తక్షణమే నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ మందముల రజిత, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

పెండింగ్ పనులు చేపట్టాలని వినతి



అల్వాల్: డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న తాగునీటి పైపులైన్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ సోమవారం జలమండలి జీఎం సునీల్‌కు మాచ్‌ను డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతిశ్రీనివాస్‌రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే డివిజన్ పరిధిలోని సెయింట్ జేవియన్స్, ఆదర్శనగర్, తిరుమల ఎన్‌క్లేవ్, శ్రీబేకరి రోడ్డు, మహాబోధి స్కూల్ సమీప ప్రాంతాల్లో బకెట్ క్లీనింగ్ పనులు చేపట్టాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మౌలాలి: డివిజన్ ఆర్కే హౌసింగ్ సొసైటీలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కాలనీ సెక్రటరీ దివాకర్, అలివేలు, సుదర్శన్, పోశెట్టి, జయరాం పాల్గొన్నారు.

